క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలి

ఒంగోలు: ఎయిడెడ్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ టీచర్స్ గిల్డ్ నాయకులు మంగళవారం జిల్లా విద్యాశాఖ అధికారి డి.సుభద్రను కలిసి విజ్ఞప్తి చేశారు. జీవో నెంబర్ 155 ప్రకారం మండల విద్యాశాఖ అధికారులకు ప్రొసీడింగ్స్ జారీ చేయాలని, ఎయిడెడ్ పాఠశాలలకు ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలనే పలు విషయాలను డీఈవో దృష్టికి తీసుకువెళ్లారు. ఏపీటీజీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోడూరి వెంకట్రావు, సీహెచ్ ప్రభాకరరెడ్డి పాల్గొన్నారు.

జై జవాన్.. జై కిసాన్ జోడో యాత్ర

ఒంగోలు సెంట్రల్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో దేశవ్యాప్తంగా పార్లమెంట్, అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేయనున్నట్లు భారతీయ జవాన్ కిసాన్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వరికూటి ఆంజనేయులు తెలిపారు. ఒంగోలు నగరంలో జై జవాన్ జై కిసాన్ జోడో యాత్ర నిర్వహించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వరికూటి ఆంజనేయులు మాట్లాడుతూ దేశ భద్రతా విభాగాల్లో పనిచేసి పదవీవిరణమ పొందిన ఉద్యోగులు సమాజ సేవ చేయటమే లక్ష్యంగా పార్టీలో సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. నారాయణ అంకుష్, కేఎన్ నాయక్, సురేష్ కుమార్, మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు జయంతి, వై. రాజు పాల్గొన్నారు.

నేడు దామోదర సంజీవయ్య జయంతి

ఒంగోలు సెంట్రల్: ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ దామోదర సంజీవయ్య 104వ జయంతి జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రకాశం భవన్ ఎదురుగా ఉన్న దామోదర సంజీవయ్య విగ్రహం వద్ద నిర్వహించనున్నారు. ఈమేరకు జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి ఎస్. లక్ష్మా నాయక్ తెలిపారు. జిల్లాలోని రాజకీయ నాయకులు, అధికారులు, దళిత, ప్రజా సంఘాల నాయకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

నాగులుప్పలపాడు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం నాగులుప్పలపాడులోని మండల పరిషత్ కార్యాలయంలో అధ్యక్షుడు నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మహాలక్ష్మి తెలిపారు. ప్రత్యేక ఆహ్వానితులుగా రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున హాజరవనున్నట్లు ఎంపీపీ అంజమ్మ కృష్ణారెడ్డి తెలిపారు.

పోలింగ్ స్టేషన్‌ల పరిశీలన


ఇలపావులూరులో పోలింగ్ స్టేషన్‌లను పరిశీలిస్తున్న సీఐ దుర్గా ప్రసాద్

చీమకుర్తి: సీఐ దుర్గా ప్రసాద్ మంగళవారం చీమకుర్తి మండలంలోని పలు గ్రామాల్లో పోలింగ్ స్టేషన్‌లను పరిశీలించారు. వాటితో పాటు సమస్యాత్మకంగా గుర్తించిన పోలింగ్ స్టేషన్‌ల వివరాలను తెలియజేశారు. వాటిలో గాడిపర్తివారిపాలెం, గోనుగుంట, కూనంనేనివారిపాలెం, నాయుడుపాలెం, ఇలపావులూరు, చంద్రపాడు, తొర్రగుడిపాడు, చినరావిపాడు ఉన్నట్లు తెలిపారు. పోలింగ్ స్టేషన్‌ల పరిసరాలు, ఆయా గ్రామాల్లోని రాజకీయ నేపథ్యం, గతంలో జరిగిన సంఘటనలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు.

మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుని నియామకం

ఒంగోలు సెంట్రల్: బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా ఖాదర్ వలి షఫీని నియమిస్తూ ఉత్తర్వులు అందాయి. మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ బాజీ సూచన మేరకు జిల్లా అధ్యక్షుడు పీవీ శివా రెడ్డి నియమించారు. జిల్లాలో ముస్లిం మైనార్టీలను పార్టీలోకి తీసుకువచ్చి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. వారికి ఖాదర్ వలి షఫీ కృతజ్ఞతలు తెలిపారు.

కాంప్లెక్స్ మీటింగ్‌లను పర్యవేక్షించాలి

ఒంగోలు: ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల కాంప్లెక్స్ మీటింగ్‌లను పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులు పర్యవేక్షించాలని ఒంగోలు ఉప విద్యాశాఖ అధికారి అనితరోజ్‌రాణి సూచించారు. స్థానిక పీవీఆర్ బాలికోన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం నిర్వహించిన ఒంగోలు, సంతనూతలపాడు నియోజకవర్గంలోని మండలాల ఎంఈవో , స్కూల్ కాంప్లెక్స్ హెడ్మాస్టర్ల సమావేశాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాల్ట్ ప్రాజెక్టులో భాగంగా ప్రవేశపెట్టిన ఫిర్కి యాప్, టీచ్ టూల్స్, మిస్ కాన్సెప్షన్ పోస్టర్ వంటి కార్యక్రమాలు పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆమె వెంట ఒంగోలు మండల విద్యాశాఖ అధికారులు టి.కిషోర్‌బాబు, సరస్వతి, సమగ్రశిక్ష ఏయంఓ యం.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చదువులమ్మకు వందనం

- నేడే వసంత పంచమి
- సామూహిక అక్షరాభ్యాసాలు
- అమ్మవారికి సరస్వతీ రూపంలో ప్రత్యేక పూజలు


అమ్మవారి ప్రతిమ


సామూహిక అక్షరాభ్యాసంలో చిన్నారులు

ఒంగోలు మెట్రో: మాఘమాసం శుద్ధ పంచమి.. వసంత పంచమి వేడుకలు ప్రకాశం జిల్లాలో వైభవంగా నిర్వహిస్తున్నారు. స్థానిక అంజయ్య రోడ్డులోని ఆంధ్ర కేసరి విద్యా కేంద్రంలో వసంత పంచమి సరస్వతీ దేవి జన్మదినం మాఘశుద్ధ పంచమి, బుధవారం వసంత పంచమి సందర్భంగా స్థానిక అంజయ్య రోడ్డు ఆంధ్ర కేసరి విద్యా కేంద్రంలో ఉదయం 10 : 56 నిమిషాలకు సరస్వతీ మాత విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పూజ శ్రీ పరిపూర్ణ సిద్దానంద స్వామి, (శ్రీఅచలానంద ఆశ్రమం) స్వామిపూజ శ్రీ సత్యాత్మనంద స్వామి (చిన్మయ్య మిషన్) పాల్గొంటున్నారని కళాశాల యాజమాన్యం వారు తెలిపారు. ఒంగోలు ఉత్తర బైపాస్ రోడ్డు వెంకటేశ్వర కాలనీలో సరస్వతి శిశు విద్యా కేంద్రంలో చిన్నారులకు సామూహికంగా అక్షరాభ్యాసం మహోత్సవం నిర్వహిస్తున్నారు. స్థానిక విజ్ఞాన భారతి, విజ్ఞాన విహార్ , శిశు మందిర్ విద్యా మందిర్ పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహిస్తున్నట్లు విద్యా భారతి తెలిపారు.

ఆ తల్లి కటాక్షంతో చదువు



చదువురాని వారిని కూడా మహాకవిగా చేసే శక్తి దేవికి ఉంది. ఆ తల్లిని మనసారా ప్రార్థించడం ముఖ్యం. ఆ దేవిని పూజిస్తే పాండిత్యాన్ని, కవిత్వాన్ని , ప్రజాకర్షణను, అధికారాన్ని, ఐశ్వర్యాన్ని అందిస్తుంది.

– శ్రీ పరిపూర్ణ సిద్దానంద స్వామి

మూర్ఖుడు సైతం మహా విద్వాంసుడిగా మారిపోతాడు



సకల విద్యా స్వరూపిణి పూజిస్తే మహా విద్వాంసుడిగా మారిపోతాడు. సకల విద్యలకు అధిదేవత అయిన శ్రీ సరస్వతి దేవి ఆవిర్భవించిన మాఘ శుద్ధ పంచమి పర్వదినం ఈరోజు చాలా విశేషమైంది. ఆ తల్లి దయ ఉండాలి.

– మతంపల్లి దక్షిణామూర్తి

150 మంది చిన్నారులకు..



43 సంవత్సరాల నుంచి మా విద్యాలయంలో చిన్నారులతో సామూహిక అక్షర మహోత్సవం ఒంగోలు గాయత్రీ పరివార్ లక్కరాజు రాజ్యలక్ష్మి వారి ఆధ్వర్యంలో జరుపుతున్నాం. అక్షర స్వీకారాలు, గాయత్రి హోమాలు చిన్నారులకు పలక బలపం తెలంగాణలోని బాసరలోని ఆలయంలో నుంచి అమ్మవారి కుంకుమ సరస్వతీ రూపాన్ని ఉచితంగా అందిస్తున్నాం. ఈ అక్షర మహోత్సవంలో సుమారుగా 150 మంది చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహిస్తున్నాం.

– రాజ్యలక్ష్మి, సరస్వతీ శిశు మందిరం ప్రధానోపాధ్యాయురాలు

హిట్ అండ్ రన్ చట్టం దుర్మార్గం


ప్రసంగిస్తున్న శ్రీనివాసరావు

ఒంగోలు టౌన్: డ్రైవర్ వృత్తిని దెబ్బతీసే విధంగా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన హిట్ అండ్ రన్ చట్టాన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల 16న చేపట్టిన దేశ వ్యాప్త టైర్ బంద్‌ను విజయవంతం చేయాలని ఆల్ ఇండియా రోడ్‌ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మంగళవారం సీఐటీయూ కార్యాలయంలో ఆటో ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ నగర కమిటీ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టం అమల్లోకి వస్తే డ్రైవర్ వృత్తి చేసేవారే ఉండరని చెప్పారు. దేశంలోని రహదారుల నిర్వహణను నిర్లక్ష్యం చేస్తూ మరోవైపు రోడ్డు ప్రమాదాల గురించి క్రూరమైన చట్టాలను తీసుకొనిరావడం దారుణమన్నారు. నాయకులు తంబి శ్రీనివాసులు, సత్యం, ఆనంద్, అంగిరేకుల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

16న గ్రామీణ బంద్‌కు వామపక్షాల మద్దతు


మాట్లాడుతున్న సయ్యద్ హనీఫ్

ఒంగోలు టౌన్: సంయుక్త కిసాన్ మోర్చా, భారత్ కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 16న జరిగే గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెకు వామపక్షాలు సంపూర్ణంగా మద్దతు ప్రకటించాయి. మంగళవారం సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ మాట్లాడారు. రైతులు, వ్యవసాయ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం దగా చేసిందని విమర్శించారు. వాస్తవానికి ఆ నల్లచట్టాలను సంపూర్ణంగా రద్దు చేయలేదన్నారు. బీజేపీ ప్రభుత్వంలో దేశంలో 1.52 లక్షల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 16న చేపట్టిన సమ్మె, బంద్‌లను విజవంతం చేయాలని కోరారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, నాయకులు చిట్టిపాటి వెంకటేశ్వర్లు, డీవీఎన్ స్వామి, కంకణాల ఆంజనేయులు, పీవీఆర్ చౌదరి, ఆర్.వెంకటరావు, కొత్తకోట వెంకటేశ్వరరావు, ఎంఎస్ సాయి పాల్గొన్నారు.

పేదలకు అండగా నిలుస్తా


అన్నంగి గ్రామ నాయకులతో మాట్లాడుతున్న, మంత్రి మేరుగు నాగార్జున

మద్దిపాడు: నియోజకవర్గంలోని పేదలకు అండగా నిలుస్తానని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి , జిల్లా ఇన్‌చార్జి మంత్రి సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి మేరుగు నాగార్జున అన్నారు. మంగళవారం సాయంత్రం ఆయన మండలంలోని అన్నంగి గ్రామంలో ఏర్పాటు చేసిన నాయకులతో పరిచయ కార్యక్రమంలో మాట్లాడారు. నియోజకవర్గంలో ఉన్న సమస్యలను ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరించడానికి తన శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. పేదలకు ఎటు వంటి సమస్య వచ్చినా తాను వారికి అండగా నిలిచి సమస్యను పరిష్కరిస్తానని చెప్పారు. ప్రజలకు సేవ చేయడానికే రాజకీయం లోకి వచ్చామని అటువంటి అవకాశం దొరకడం మహా భాగ్యమన్నారు. నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించి సమస్యలను కూడా తెలుసుకుంటానని తెలిపారు. విద్యార్థులకు ఇంగ్లీష్ మీడియం చదువులు చెప్పించడం ద్వారా వారి కుటుంబాల్లో వెలుగులు వస్తాయని తద్వారా సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. ముఖ్యమంత్రి జగన్‌కు వస్తున్న గ్రాఫ్ తట్టుకోలేని చంద్రబాబు తన పచ్చ మీడియా ద్వారా విషం చిమ్ముతున్నాడతన్నారు. నావలన మీకుటుంబంలో మేలు జరిగితేనే నాకు ఓటు వేయండన్న దమ్మున్న ముఖ్యమంత్రి అని.. రాబోయే ఎన్నికల్లో భారీ మెజారిటీ ఇచ్చి ఆయన సంకల్పం వై నాట్ 175ను పూర్తి చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ముందుగా ఆయన అన్నంగి ఎస్సీ కాలనీలో పర్యటించి మృతి చెందిన జెడ్పీటీసీ సభ్యురాలు తేళ్ల భాగ్యలక్ష్మి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన గ్రామంలో సర్పంచ్ పల్లపాటి లోకేశ్వరి, ఎంపీటీసీ సభ్యురాలు రాయపాటి వెంకట సుజాత గృహాలకు వెళ్లి మాట్లాడారు. మండల పార్టీ అధ్యక్షుడు మండవ అప్పారావు ప్రధాన కార్యదర్శి వాకా కోటిరెడ్డి, వైస్‌ఎంపీపీ పైడిపాటి వెంకట్రావు. సీనియర్ నాయకులు, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బెజవాడ రాము, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు నారా సుబ్బారెడ్డి గుడ్లపాతల రవి,గట్టినేని అయ్యన్న, పోతినేని శ్రీనివాసరావు, పిట్టల ఆంజనేయులు, తేళ్ల పుల్లారావు, రావిపాటి రమేష్, పైనం ప్రభాకర్, మేరుగ పద్మ, పల్లకి పద్మకుమారి, బొమ్మల ఏసుదాసు, బొమ్మల రామాంజనేయులు గ్రామ సర్పంచ్ పల్లపాటి లోకేశ్వరి , నాయకులు అన్వేష్ ,దుడ్డు వినోద్,తదితర నాయకులు పార్టీ కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

సైన్స్ ఒలింపియాడ్‌లో మాంటిస్సోరి ప్రతిభ

ఒంగోలు: హైదరాబాద్ స్పెక్టర్ అకాడమీ నిర్వహించిన ఇండియాస్ ఫస్ట్ సైన్స్ ఒలింపియాడ్‌లో ఒంగోలు మాంటిస్సోరి విద్యార్థులు ప్రతిభ కనబరిచి నగదు బహుమతులను కైవసం చేసుకున్నారు. మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విజేతలకు పాఠశాల కరస్పాండెంట్ శబరీనాథ్ బహుమతులను అందించి అభినందించారు. తమ పాఠశాలలో అమలు చేస్తున్న విద్యావిధానం, శాస్త్రీయ కోణంలో, సృజనాత్మకతతో సొంతంగా ఆలోచించేలా ఉండటం వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయన్నారు. ప్రిన్సిపాల్ నూరుద్దీన్, వైస్ ప్రిన్సిపాల్ నరేష్‌బాబును అభినందించారు.

లేగదూడల సంరక్షణతో రైతులు బలోపేతం


నట్టల నివారణ మందును అందిస్తున్న వెటర్నరీ జేడీ బేబీరాణి

చీమకుర్తి: లేగదూడలను సంరక్షించుకోవడం ద్వారా రైతులు ఆర్థికంగా బలోపేతమవుతారని వెటర్నరీ జేడీ కె.బేబీరాణి అన్నారు. మట్టిపాడులో ఏర్పాటు చేసిన లేగదూడల ప్రదర్శన కార్యక్రమాన్ని జేడీ సందర్శించారు. లేగదూడల పెంపకం పట్ల తీసుకోవాలసిన జాగ్రత్తలను వివరించారు. లేగదూడలకు సరిపడా పాలును అందిస్తే వాటిలోని మరణాలను తగ్గించవచ్చన్నారు. సెక్స్ సార్టెడ్ సెమన్ పథకం ద్వారా అన్ని ఆడ దూడలే జన్మిస్తాయని, రైతులు కృత్రిమ గర్భధారణలో ఈ విధానాన్ని పాటించటం వలన ఆర్థికంగా లాభాలను పొందవచ్చన్నారు. ఏడీ కాలేషా, స్థానిక డాక్టర్‌లు, రైతులు పాల్గొన్నారు.

షెడ్ నిర్మాణానికి భూమి పూజ


కొబ్బరికాయ కొడుతున్న ఎంపీపీ అంజమ్మ కృష్ణారెడ్డి, ఎంపీడీఓ మహాలక్ష్మి

నాగులుప్పలపాడు: గ్రామ పంచాయతీల్లో నిధుల సమీకరణే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి అన్నారు. నాగులుప్పలపాడులో నూతనంగా నిర్మాణం తలపెట్టిన ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ కోసం మంగళవారం ఎంపీడీవో మహాలక్ష్మితో కలిసి భూమి పూజ చేశారు. ఈ ఎంపీపీ అంజమ్మ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పనులను వేగవంతం చేసి నిర్మాణాలు పూర్తి చేయాలని అధికారులను కోరారు. నలమలపు కృష్ణారెడ్డి, పోలినేని కోటేశ్వరరావు, మద్దిసాని నాగేశ్వరరావు, ఎంపీటీసీ పావన్, గండు వెంకట్రావు, బాలకృష్ణ, శాంసన్, ఏపీవో రవి, ఈసీ విజయలక్ష్మి ఉన్నారు.

కెరీర్ గైడ్స్‌పై అవగాహన పెంచుకోవాలి


అవగాహన కల్పిస్తున్న భరద్వాజ

కొత్తపట్నం: ప్రతి విద్యార్థి కెరీర్ గైడ్స్‌పై అవగాహన పెంచుకుంటే జీవితంలో స్థిరపడతారని జిల్లా ఉపాధి కల్పనాధికారి భరద్వాజ అన్నారు. స్థానిక బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం కెరీర్ గైడ్స్‌పై పదో తరగతి విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా భరద్వాజ మాట్లాడుతూ పదో తరగతి పూర్తి అయిన తరువాత జీవితంలో ఉపయోగపడే వివిధ రకాల కోర్సుల గురించి వివరించారు. చదువుకుని జీవితంలో స్థిరపడే విధంగా కోర్సులను ఎన్నుకోవాలని సూచించారు. కొంత మంది బాగా చదువుకుని ఆ చదువును సక్రమంగా వినియోగించుకోకుండా నిరుపయోగంగా ఉన్నారని గుర్తు చేశారు. శ్రీదేవి మాట్లాడుతూ మీరు ఏ కోర్సు తీసుకోవాలో పదో తరగతి అయిపోయిన వెంటనే మీకే తెలుస్తుందన్నారు. స్టెప్ మేనేజర్ శ్రీమన్నారాయణ, ఉపాధ్యాయుడు జిలాని బాష, హరిబాబు పాల్గొన్నారు.

మహిళా మార్ట్ సందర్శన


మద్దిపాడులోని మహిళా మార్టును పరిశీలిస్తున్న వసుంధరాదేవి

మద్దిపాడు: మండల కేంద్రం మద్దిపాడులో డీఆర్‌డీఏ వైఎస్ఆర్ క్రాంతిపథం కార్యాలయం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళామార్టును ఆ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ వసుంధరాదేవి మంగళవారం సందర్శించారు. అనంతరం మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో స్టాఫ్‌తో రివ్యూ నిర్వహించారు. ఏపీఎం నరేంద్ర కుమార్ సీసీలు మూర్తి మోహనరావు ప్రేమానందం, మహిళా మార్ట్ సీసీ మేరీ కుమారి సందీప్ మల్లీశ్వరి అకౌంటెంట్ వెంకటరత్నం మహిళా మార్టు కోశాధికారి రేణుక పాల్గొన్నారు.

శనగ పంట దిగుబడుల అంచనా


పంటకోత ప్రయోగాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

మద్దిపాడు: మండలంలోని గుండ్లాపల్లి వ్యవసాయ భూముల్లో రైతులు వేసిన శనగ పంట దిగుబడి ఏమేరకు వస్తుందో అని గణాంక అధికారి వేణుగోపాలరెడ్డి మంగళవారం పంట కోత ప్రయోగం ద్వారా పరిశీలించారు. పంట దిగుబడి తక్కువగా ఉంటే ప్రభుత్వం వారు ఇచ్చే నష్ట పరిహారం ఇవ్వడానికి అవకాశం ఉంటుందన్నారు. ఏఎస్ఓ విజయలక్ష్మి, వీఏఏ సాయి బజాజ్ ఫైనాన్స్ క్రాప్ ఇన్‌స్రూ నవీన్, రైతులు పాల్గొన్నారు.

ఆల్‌బెండజోల్ మాత్రల పంపిణీ


మాత్రలు పంపిణీ చేస్తున్న వైద్యాధికారులు

ఒంగోలు: నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా స్థానిక పేస్ ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులకు మంగళవారం నులిపురుగుల నిర్మూలన మాత్రలను అధికారులు పంపిణీ చేశారు. డిప్లొమా విభాగానికి చెందిన 600 మంది, బీటెక్‌కు చెందిన 1000 మంది విద్యార్థులకు ఆల్‌బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్ర అధికారి డి. మత్తయ్య, హెచ్‌ఈవో కె.శ్రీనివాసులు, ఏఎస్ఎం అరుణ, హెచ్‌వీ ఝాన్సీలక్ష్మీభాయి, ఆశ కార్యకర్తలు పాల్గొనగా.. కాలేజీ ప్రిన్సిపాల్ జీవీకే మూర్తి, కోఆర్డినేటర్ డాక్టర్ పి.బ్రహ్మం పర్యవేక్షించారు.

జేఈఈ మెయిన్స్‌లో శ్రీ సరస్వతి సంచలనం



అభినందనలు తెలుపుతున్న రమణారెడ్డి తదితరులు

ఒంగోలు: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో తమ కాలేజీ విద్యార్థులు సంచలన విజయాలు నమోదు చేశారని శ్రీసరస్వతి విద్యా సంస్థల చైర్మన్ ఏవీ రామణారెడ్డి తెలిపారు. మంగళవారం విలేకరులతో మాట్లాడారు. గుంటూరు, విజయవాడలో ఉన్న కార్పొరేట్ కాలేజీల కన్నా దీటుగా తమ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారన్నారు. జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌లో 15 సంవత్సరాల కనీస అనుభవం కలిగిన అధ్యాపకులతో బోధించడంతో అదనంగా గంట బోధన, ఒక గంట అదే అధ్యాపకునిచే స్టడీ అవర్, మరో గంట పోటీపరీక్షలకు శిక్షణ ఇవ్వడం ఉపకరిస్తోందన్నారు. తమ అధ్యాపక బృందం రూపొందించిన సొంత మెటీరియల్‌తో అద్భుత ఫలితాలు సాధించినట్లు చెప్పారు. కె.సాకేత్ సాయిరాం 98.24 పర్సంటైల్, ఆర్.చంద్రవిహారిక 97.57పర్సంటైల్, కె.సాయికిరన్ 97.45 పర్సంటైల్, కె.గోపీచంద్ 97.40 పర్సంటైల్, ఎస్.ఇంద్రసేనా రెడ్డి 95.32 పర్సంటైల్ సాధించి జిల్లా స్థాయిలో మొదటి అయిదు స్థానాలను కైవసం చేసుకున్నారన్నారు. 90 పర్సంటైల్ పైన 14 మంది, 80 పర్సంటైల్ పైన 46, 70 పర్సంటైల్ పైన 123 మంది నిలిచారని, జేఈఈ అడ్వాన్స్‌కు 170 మంది క్వాలిఫై అవుతారని తాము అంచనా వేస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థులు, విద్యా సంస్థల డైరెక్టర్లు ఎ. గణేష్‌రెడ్డి, ఎ.గంగా శంకరరెడ్డి, సీఈవో ఎన్వీ సురేష్‌ను అభినందించారు.

జగనన్న సురక్షతో అందరికీ ఆరోగ్యం


మందులు పంపిణీ చేయిస్తున్న వైద్యశాఖ సిబ్బంది

మద్దిపాడు: జగనన్న ఆరోగ్య సురక్ష–2తో ప్రతి ఒక్కరి ఆరోగ్యం మెరుగవుతుందని ఎంపీడీఓ సుగుణమ్మ అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశ పెట్టిన జగనన ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పేదలకు బాగా అందుతుందని తెలిపారు. కూలీ పనులు చేసుకునే పేదలకు కార్పొరేట్ ఆస్పత్రుల వైద్యులు ఈ కార్యక్రమంలో పాల్గొని పరీక్షలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం ఎంపీడీఓ చేతుల మీదుగా వైద్య సిబ్బంది రోగులకు మందులు పంపిణీ చేయించారు. డాక్టర్లు పి. సుస్మిత, రామాంజనేయులు, ఎన్వీ సుస్మిత, ఆనందమోహన్, వినీల చౌదరి, పీహెచ్ఎన్ పద్మావతి, సూపర్‌వైజర్లు బాలకోటయ్య, సీతమ్మ నాగరాజు పాల్గొన్నారు.

బాలోత్సవంలో చిలకపాడు విద్యార్థుల ప్రతిభ


ప్రశంసపత్రాలు అందిస్తున్న హెచ్ఎం స్వప్నరాజు

చీమకుర్తి: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఒంగోలులో నిర్వహించిన బాలోత్సవంలో సంతనూతలపాడు మండలం చిలకపాడు జిల్లాపరిషత్ హైస్కూలు విద్యార్థులు ప్రతిభను చాటినట్లు హెచ్ఎం స్వప్నరాజు తెలిపారు. ప్రతిభ చాటిన 25 మంది విద్యార్థులకు మంగళవారం హెచ్ఎం చేతుల మీదుగా ప్రశంసపత్రాలను అందించారు. మట్టితో బొమ్మలను తయారు చేయటం, ముగ్గులతో గణితం వంటి విభాగాల్లో అశ్విత, లక్ష్మీ సుమతి, స్పందన ప్రతిభచాటి బహుమతులను సాధించినట్లు తెలిపారు. వారితో పాటు బాలోత్సవంలో పాల్గొన్న 25 మందికి ప్రశంసపత్రాలను అందించినట్లు తెలిపారు.

జామాయిల్ తరలిస్తున్న లారీ సీజ్

పామూరు: అక్రమంగా జామాయిల్ తరలిస్తున్న లారీని సీజ్ చేసి అందులోని 5 టన్నుల జామాయిల్ కర్రలను స్వాధీనం చేసుకున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. మండలంలోని దూబగుంట్ల సమీపంలో అగ్రిగోల్డ్‌కు చెందిన జామాయిల్ తోటలోని కర్రలను కొట్టించి తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు స్థానిక వీఆర్‌ఓ శివప్రసాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. స్పందించిన హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరావు ఘటనా స్థలానికి వెళ్లి 5 టన్నుల జామాయిల్ కర్రలు, తరలించేందుకు సిద్ధంగా ఉన్న లారీని సీజ్‌చేసి కేసునమోదుచేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

ఆకట్టుకున్న కళాజాత

కందుకూరు రూరల్: విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని, ప్రశ్నించేతత్వాన్ని పెంచడానికి ఉద్దేశించిన కళాజాత ప్రదర్శనలు విద్యార్థులను విశేషంగా ఆకట్టుకున్నాయి. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కమటీ ఆధ్వర్యంలో సైన్స్ కళాజాత ప్రదర్శనను స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రదర్శించారు. ఈ సందర్భంగా జాత కన్వీనర్, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకుడు మురళీధర్ మాట్లాడుతూ మారుతున్న సమాజంలో అశాస్త్రీయ ధోరణులు పెరిగిపోతున్నాయని, పరావరణ కాలుష్యం అధికమవుతుందన్నారు. సాంకేతిక విజ్ఞానం యువతను పెడదోవ పట్టిస్తుందన్నారు. వీటిని వ్యతిరేకంగా జనవిజ్ఞాన వేదిక పనిచేస్తుందన్నారు. పిల్లల్లో ప్రశ్నించేతత్వం పెంచడమే జన విజ్ఞాన వేదిక లక్ష్యమన్నారు. రాష్ట్ర నాయకులు త్రిమూర్తులు, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.కృష్ణారెడ్డి, కార్యదర్శి కృష్ణకుమార్, విద్యావిభాగ కన్వీనర్ జీవీ.మాల్యాద్రి, పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు విప్రనారాయణ, మహల్యారావు, జేవీవీ నాయకులు శరత్, చిత్తారు వెంకటేశ్వర్లు, నర్సింగరావు పాల్గొన్నారు